

# అనుభవం!

దూరదర్శి

ఉదయం పదిగంటలప్పుడు బైటికి వెళ్దామనుకుంటుండగా స్టీమరల్లే ఉన్న ఇంపోర్టెడ్ కారు ఇంటిముందు ఆగింది. నాకోసం వచ్చేవారెవరికీ అంత గొప్ప వాహనాలు లేనందువల్ల ఎవరికోసమోలే అనుకున్నాను.

కాని ఆ కారులోనుంచి విలువైనసూటు ధరించిన వ్యక్తి దిగి "రావుగారి ఇల్లేనా?" అనడిగాడు.

నేను 'ఔ' నన్నట్లు తల ఆడించగానే నమస్కరించాడు. లోపలికి ఆహ్వానించి కూర్చోబెట్టాను.

"రంగరాజపురం రాణిగారు శ్రీమతి సుశీలమ్మగారి సెక్రటరీని. ఇవాళ మధ్యాహ్నం రాజాగారు, రాణీగారు మద్రాసు వస్తున్నారు రేపుఉదయంవారు స్విజర్లండ్ వెళ్తారు. రాణీగారు తమతో పదినిమిషాలు మాట్లాడాలన్నారు. తమకు అవకాశం ఉంటే యీ సాయంత్రం ఐదుగంటలకు అడయారులోఉన్న వారి బంగళాకు దయచేయమని చెప్పారు," అన్నాడు అతను.

రంగరాజపురం రాణీ అంటే మహదైశ్వర్యవంతురాలు. పూర్వాశ్రమంలో ఆమె సుప్రసిద్ధ తారామణి. అటు సినిమాల్లోనూ, ఇటు నాటకాల్లోనూ మంచి పేరూ, మంచి డబ్బూ సంపాదించిన వ్యక్తి. ఆమె నటనకు ప్రేక్షకులు ఉర్రూతలూగేవారు. ఆ తరువాత ఆమె జమీందారుగారిని వివాహమాడి సంసార

జీవితంలో పడింది. అంత గొప్పవ్యక్తి ఆహ్వానం పంపిందంటే చాలా ఆశ్చర్య పడ్డాను.

"అలాగే వస్తాను" అని అనకుండా ఉండలేకపోయాను.

సెక్రటరీ లేచి నిలబడి "కృతజ్ఞుణ్ణి, మీ ఎడ్రస్ కనుక్కొనేందుకు మూడు గంటలు పట్టింది...కారు పంపమంటారా?" అన్నాడు.

"ఇబ్బంది కాకుంటే పంపండి," అన్నాను.

ఆయన నమస్కరించి వెళ్ళిపోయాడు

జీవితంలో సుశీలను ఒక్కసారే కలుసుకున్నాను. ఆ రోజుల్లో ఆమె కీర్తి ఆకాశమెత్తున మెరుస్తున్నది. నేను బి. ఏ. ఫైనల్ ఇయర్ చదివేవాణ్ణి. సాహిత్యం మీద మనసుపోయి ఒక నాటకం రాశాను. కాలేజీ నాటక సమాజంవాళ్ళకు అది నచ్చి నాటకం ఆడాలని తీర్మానించుకున్నారు. సుశీల కథానాయిక పాత్ర ధరిస్తే కలెక్షన్ చాలా వుంటుందని నాటక సమాజం ఆర్థికంగా మంచి స్థితిలో వుండగలదనీ ఆశించి, ఆమెను అర్థించారు. ఏ మూడ్‌లో వున్నదోకాని ఆమె అంగీకరించింది. ఐతే ఆ నాటకం ఒకసారి చదవాలన్నది. సమాజంవాళ్లు ఆ నాటకాన్ని ఆమెకు ఇచ్చారు.

పదిరోజుల తరువాత సమాజం వాళ్లు నాకు కబురు పెట్టారు. నా నాటకం ప్రదర్శించబడినట్లు, గొప్ప రచయితగా గుర్తించబడినట్లు కలలుగంటూ వెళ్ళాను.

"సుశీల యీ నాటకంలో నటించనన్నది—" అన్న పిడుగులాంటి వార్త సమాజంవాళ్ళు అందించారు.

"ఎందుకని?" అని అడిగాను.

"మాకు తెలియదు...నిన్నొకసారి పంపితే నాటకాన్నిగూర్చి చర్చిస్తానన్నది," అన్నారు వాళ్ళు.

ఏ వైనా కొద్ది మార్పులు చేస్తే సరిపోతుందేమో? ఐనా అంత గొప్పతారతో మాట్లాడే అవకాశం వచ్చినందుకు సంతోషించాను.

ఆ సాయంత్రం ఆమె ఇంటికి—ఇల్లా అది బ్రహ్మాండమైన రాజమందిరం!— వెళ్ళాను. పావుగంట కాచుకూర్చున్నాక గదిలోకి సుగంధంతో కూడిన పిల్లతెమ్మెరలు ప్రవేశించినవి. వాటి వెనుకనే మెరుపుతీగల్లే వున్న సుశీల ప్రవేశించింది. ఆ అందచందాలూ, ఆ హొయలు, ఆ ఠీవి, ఆ కాంతీ—ఒకటేమిటి ఆమె మానవజాతికి గాక, దేవాంశకు సంబంధించిన వ్యక్తి అనే భావాన్ని కలిగించి తీరుతుంది. నాకు తెలియకుండానే లేచి నిలబడి నమస్కరించాను.

కూర్చోమని సైగచేసి. ఆమెకూడా కూర్చొని "నువ్వేనా ఈ నాటకం రాసింది?" అన్నది.

ఏకవచన ప్రయోగంచేసినా నేను కించపడలేదు. ఆమె గొప్పదనే భావమూ



వయస్సులో నేను చిన్నవాణ్ణనే జ్ఞానమే అందుకు కారణాలు అయివుంటవి.

"ఔనండీ!" అన్నాను.

"నాటకం జీవితానికి దర్పణంగా వుండాలి; అంతేకాని ఏదో ఆదర్శం కోసమని పాకులాడుతూ, సందర్భశుద్ధి లేని సన్నివేశాల్ని సృష్టించటం, నిజానికి దూరంగా జరగటం కూడదు..."

"నా నాటకంలో వాస్తవికత లేదంటారా?"

ఆమె సెలయేటి గలగలలను జ్ఞాపకం చేసే నవ్వు నవ్వింది.

"వాస్తవికత! ఎక్కడున్నది ఆ నాటకంలో! కథానాయిక చాలా అందగత్తె, ధనవంతురాలు. సుగుణవతి, విద్యావతి; అలాటి వ్యక్తి కుంటికాలువాణ్ణి పెళ్ళిచేసుకొని సుఖపడిందని రాశారు. ఆమెకు ఏం ఖర్మ? అంతకన్న మంచి సంబంధం దొరకలేదా?" అన్నది సుశీల.

"ఆమె అతన్ని ప్రేమించింది!" అన్నాను.

"ప్రేమా? ప్రేమంటే నీకేం తెలుసు? నీ తల్లీ, అక్కచెల్లెళ్లూ తప్ప వేరొక స్త్రీతోటి పరిచయమన్నా వున్నదా?

ప్రేమను అనుభవించకుండానే ప్రేమను గూర్చి మాట్లాడే హక్కు నీ కేమున్నది? నీ వయసుకు ప్రేమ అంటే అర్థమయ్యే శక్తిలేదే? ప్రేమకు కూడా అర్హతలు వుంటవి. దాహమైనదని మురుగు గుంటలో నీళ్లు తాగుతామా? అంతస్తు చూడకుండా, అర్హత పాటించకుండా గుడ్డెద్దు చేలోపడినట్టు ప్రేమించేయడం ఎలా సాధ్యం?'' అన్నదామె.

"ప్రేమ గుడ్డిదన్నారు కదండీ!" అని సమర్థించాను.

"ప్రేమించేవాళ్ళు కూడా గుడ్డివాళ్ళా యేం?"

"కనీసం మానవత్వం, సానుభూతి మొదలైనవి..."

నా మాటలకు అడ్డంవచ్చి ''మానవత్వం! ఆ పేరుతో తన సుఖ సౌఖ్యాలు నాశనం చేసుకోవటం, సానుభూతిఅంటూ సుడిగుండంలోకి దూకటం మొదలైనవి కథల్లో సాధ్యమేమో గాని నిత్యజీవితంలో మాత్రం కాదు. అంత మానవత్వమూ, సానుభూతి ఉంటే ఐశ్వర్యము ఉన్నది కనుక కొంత ధనసహాయం చేయవచ్చునేమో? అంతేకాని తన జీవితసర్వస్వాన్ని కురూపియైన భర్తపాదాలముందు సమర్పించటం మూర్ఖత్వం అవుతుంది! వాస్తవానికి చాలా దూరం!" అన్నది ఉద్రేకంగా.

"కథ మార్చాలంటారా?" అన్నాను.

"మార్చేందుకు వీలులేదు. ఎక్కడ మారుస్తావు? మొత్తమంతా అతుకుల బొంతలా వున్నది. ఇలాంటి నాటకంలో నేను నటించలేను. ప్రేమ సౌందర్యానికి అంకితమై వుంటుంది. కాని, వికృతాలకూ, కురూపత్వానికి ప్రేమ ఏమిటి-ప్రేమ!" అని ఆ చివరి పదంలో తన యీసడింపును వ్యక్తపరచింది.

"కురూపులకూ, వికృతాకారులకూ ప్రేమ వుండదంటారా?"

"కురూపి సౌందర్యవతిని ప్రేమిస్తాడు; కాని సుందరి కురూపిని ప్రేమిస్తుందా? ఉభయులూ కురూపులైతే అది వేరొక విషయం!"

"అయితే ఈ నాటకాన్ని ఏంచేయమంటారు?"


ఆమె ఫక్కున నవ్వింది.

"నీవు రాసిన నాటకాన్ని ఏం చేయాలో నన్నెందుకు అడుగుతావు? తీరా అడిగావు కనుక చెవుతున్నాను. పదిమందిచేత చదివించో, పదిమంది ముందు ఆడించో నవ్వులపాలు గాకుండా దాన్ని తగలెయ్యి!''

"నాలోని రచయితను నాశనం చేయమంటారా?"

"నీలో రచయిత వున్నాడనుకోవడం నీ అహం! వాస్తవానికి దూరమైన రచన నిస్సారం. కాలాన్ని ఎందుకు వృథా చేసుకుంటావు? చదువుకో," అన్నదామె.

నా నవనాడులూ కుంగిపొయ్యాయి.




ఇక మాట్లాడేందుకు మాత్రంఏమున్నది? నన్ను పిలిపించి గాయపరచి, అవమానపరిచింది. ఇక ఆ స్థలంలో నిలవలేక పొయ్యాను. 'వెళ్ళివస్తాను' అనికూడా చెప్పకుండానే, దెయ్యాలూ, భూతాలూ తరుముతున్నట్లు వేగంగా బైటికి నడిచాను.

దీర్ఘంగా ఆలోచించాను. ఆమెచెప్పిందే నిజమనిపించింది. ఎంతో అనుభవంతో ఆమె మాట్లాడింది; కేవలం నన్ను గాయపరచటం ఆమె వుద్దేశ్యమై వుండదు. ఆమెకు అంత తీరిక ఎక్కడున్నది? దానివల్ల ఆమెకు లాభమేమిటి? తప్పుదార్లలోపడి కేవలం ఆదర్శాలకోసం వాస్తవికతను బలిపెట్టకుండా నన్ను హెచ్చరించటమే ఆమె ఉద్దేశ్యమై వుండాలి. కొన్నాళ్ళు బాధపడినా, ఆ నాటకాన్ని పెట్టెలో అడుగున పడేశాను. కష్టపడి రాసింది కనుక ఆమె చెప్పినట్లు తగలెయ్యబుద్ధికాలేదు. రచనలు మానుకున్నాను. ఆ తరువాత క్రమంగా అదంతా మరచిపొయ్యాను. ఈపదేళ్ళలోనూనేనొక నాటకం రాశాననే విషయమే జ్ఞాపకం రాలేదు. ఇప్పుడు రాణిగా ఆమె పంపిన ఆహ్వానాన్ని వినగానే ఇదంతా జ్ఞాపకం వచ్చింది.

ఆ నాడు ఆమె వ్యక్తపరచిన భావాలనే ఆమె జీవితంలో అనుసరించింది. నవయవ్వనుడూ, సుందరరూపుడూ, సకలైశ్వర్యవంతుడూ అయిన రంగరాజపురం జమీందారునే వివాహమాడింది. ప్రేమ ఎటు మొగ్గాలో ఆమె ఆదర్శప్రాయంగా రుజూచేసింది.

* * *

సరిగ్గా ఐదింటికల్లా వాళ్ళకారులోనే జమీందారుగారి బంగళా జేరాను. అప్పటికే పాతికమందిదాకా హాలులో వేచివున్నారు సెక్రటరీ ఎదురొచ్చి నన్ను ఆహ్వానించాడు. నన్ను హాలులోకి కాకుండా ఆ పక్కనున్న పెద్ద గదిలోకి తీసుకొనివెళ్ళి కూర్చోబెట్టాడు.

కాచుకొనివున్న వాళ్ళంతమందివుంటే నేను బయటపడేటప్పటికి రాత్రి ఏ పదకొండో అవుతుందనిపించింది.

"చాలా ఆలస్య మౌతుందా?" అన్నాను.

"నో, నో," . వాళ్ళందరూ రాజా గారిని చూసేందుకు వచ్చారు. రెండు నెలల క్రితం ఆయనకు పక్షవాతం వచ్చి కుడిపక్క పడిపోయింది. కుడివైపున్న అంగాలేవీ పనిచేయవు. మూతి వంకర పోయి మాటకూడా సరిగారాదు. చికిత్స కోసమే స్విజర్లెండ్ వెళుతున్నారు," అన్నాడు సెక్రటరీ.

దగ్గర్లోనే పిడుగు పడినట్లయింది. రూపసి, రూపసిని ప్రేమించింది; ఐశ్వర్యం, ఐశ్వర్యాన్ని ఆకర్షించింది. అదే ప్రేమగా పెనవేసుకొని మహావృక్ష మల్లే కనిపించింది. ఈడూ, జోడుకు నమూనాగా వున్న ఈ జంటలో ఒకరికి అంగవైకల్యం ప్రాప్తించింది. రాణి ఎంత కృంగిపోయి వుంటుందో? ఆమె ప్రేమ కూకటి వేళ్ళతో కదిలి వుండాలి. ఆమె జీవితం ఎంత తారుమారైందో!

నా ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ, "తమ రాకను రాణీగారికి తెలియ పరుస్తాను," అని సెక్రటరీ మాయ మయ్యాడు.

నే నింకా పూర్తిగా ఆలోచనల్లో నుంచి బయటపడక ముందే రాణీగారు గదిలోకి వచ్చారు. ఆ హొయలు, ఠీవి, అందచందాలు ఏమీలేవు. శోక, విషాదమూర్తి దైన్యం కరడుగట్టిన ముఖంతో, పాలి పోయిన చెక్కిళ్ళతో, తనను తానే హీన పరుచుకున్న విధంగా కనిపించిం దామె.

ఆశ్చర్యం నుంచి నేనింకా తేరుకోక ముందే ఆమె నాకు నమస్కరించింది. "బాగున్నావా?" అని ఎంతో మృదు మధుర స్వరంతో అడిగింది.

ఇంతగా మర్యాద చేస్తుందని నేను అనుకోలేదు. ఆమెకు వచ్చిన కష్టానికి ఎలా సానుభూతి చూపాలో తెలియలేదు.

"ఆ నాటకం మీదగ్గర వున్నదా?"

"ఉన్నదండీ!"

ఒక కవరు నాకు అందించిందామె.

"ఇందులో పదివేల రూపాయ లున్నాయి. ఆ నాటకాన్ని ఖరీదైన పేపరు మీద చక్కగా అచ్చు వేయించండి. ఎక్కడా నాపేరు కనబడకూడదు. ఆ తరువాత నాకో వంద కాపీలు పంపండి."

నే నేదో మాట్లాడబొయ్యాను.

"వస్తాను.." అన్నదామె. చూస్తుండ గానే ఆమె కళ్ళనుంచి టపటపా కన్నీటి బొట్లు రాలుతున్నాయి. తనను తాను సంభాళించుకునే స్థితిలోకూడా లేదు. వెళ్ళిపోయింది.

ప్రేమ స్వరూపం అనుభవంలోకి వచ్చి, మానవత్వమే మారిపోయి నట్లయింది. అనుభవం ఎంత ఖరీదను కొన్నా చౌకగానే లభ్యమైనదని అనుకో వాలేమో!?